సాక్షి వైఎస్‌ఆర్ జిల్లా

ఆదివారం । 27 । ఏప్రిల్ । 2025



ట్రిపుల్ ఐటీలతో.. ఉజ్వల భవిష్యత్తు

రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ(ఆర్జీయూకేటీ)లో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. -IIలో



ఉగ్రవాదం, మతోన్మాదాలను అరికట్టాలి

జమ్ము కశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రవాద మారణ హోమానికి నిరసనగా ప్రజానం ఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. -IIలో

గరిష్ఠం/కనిష్ఠం
42.0/28.0

వాతావరణం

జిల్లాలో శనివారం 28.0 – 42.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

మద్యం దుకాణానికి దరఖాస్తుల ఆహ్వానం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలోని జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలో మద్యం దుకాణం ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండ్ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 3 తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 5న కలెక్టరేట్‌లో డ్రా ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ 63007 20018 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

29న కడపలో జాబ్‌మేళా



కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 29న కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బెంగుళూరులోని పర్సోలెకెల్లీ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో ఆపరేటర్, హైదరాబాదులోని ఓహెచ్ఎం ఎయిర్‌పోర్టు ఎలక్ట్రిక్ క్యాబ్ కంపెనీలో డ్రైవర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ కలిగి 18-30 ఏళ్ల లోపు కలిగిన వారు ఇందుకు అర్హులన్నారు. ఎంపికైన వారికి హోదాను బట్టి రూ. 15000-22000 వరకు వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు విద్యార్హతల ధ్రువపత్రాలు, ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సార్క్ వీసాల రద్దుకు తక్షణ చర్యలు

కడప సెవెన్‌రోడ్స్: పాకిస్తానీయుల కోసం జారీ చేసిన సార్క్ వీసాలను కేంద్ర హోం శాఖ ఆదేశాల మేరకు ఈనెల 27వ తేది నుంచి రద్దు చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24వ తేది కేంద్ర హోం మంత్రిత్వశాఖ కార్యాలయ మెమొరాండం సూచనల మేరకు, ఫారినర్స్ యాక్టు-1946 సెక్షన్-3(1)లోని అధికారాలను ఖచ్చితంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పాకిస్తానీ పౌరులకు తక్షణమే వీసా సేవలను రద్దు చేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈ మేరకు పాకిస్తానీ పౌరులకు భారత ప్రభుత్వం జారీ చేసిన మెడికల్ వీసాలు, దీర్ఘకాలిక వీసాలు, దౌత్య, అధికారిక వీసాలు మినహా ప్రస్తుతం ఉన్న అన్ని చెల్లుబాటు అయ్యే వీసాలు రద్దవుతాయన్నారు. మెడికల్ వీసాలు ఏప్రిల్ 29 వరకు మాత్రమే చెల్లుతాయన్నారు. భారత ప్రభుత్వ ఆర్డర్‌కు అనుగుణంగా జిల్లాలోని సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు.

నిప్పుల కుంపటి!



- హడలెత్తిస్తున్న ఎండలు
- జనం 'ఉక్క'రిబిక్కిరి
- 42.4 డిగ్రీలకు చేరుకున్న పగటి ఉష్ణోగ్రత
- ఇప్పటికే వడదెబ్బతో జిల్లాలో ముగ్గురు మృతి
- జాగ్రత్తలు తప్పవంటున్న నిపుణులు



ఎండల తాకిడికి నిర్మానుష్యంగా మారిన ఏడు రోడ్ల సర్కిల్

కడప అగ్రికల్చర్: ఎండలు మండుతున్నాయి. నిప్పులు కక్కే సూరీడు దెబ్బకు జనం 'ఉక్క'రిబిక్కిరవుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి భానుడు భగభగమంటున్నాడు. ముఖ్యంగా నాలుగైదు రోజుల నుంచి జిల్లాలో 42 డిగ్రీలు మించి ఎండలు కాస్తున్నాయి. దీంతోపాటు రాత్రి(కనిష్ట) ఉష్ణోగ్రతలు కూడా క్రమేపీ పెరుగుతుండడం విచారకరం. ఇక పెరిగిన ఉష్ణోగ్రతలతో జిల్లాలో వడదెబ్బతో ముగ్గురు మృత్యువాతపడ్డారు. ఈ నెల 20వ తేదీ సింహాద్రిపురం మండలంలో ఓబుల్‌రెడ్డి అనే రైతు ఉపాధి పనికి వెళ్లి ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందాడు. అలాగే అట్లూరు మండలం పార్వతిపురంలో చాట్ల పాలయ్య(43) , అలాగే కొండాపురం మండలం ఎస్.తిమ్మాపురం గ్రామానికి చెందిన గోసువారిపల్లె రామ సుబ్బమ్మ(77) వడదెబ్బతో మృత్యువాత పడ్డారు. ఈ వారంలోనే ముగ్గురు వడదెబ్బకు మృతి చెందడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది.

రోడ్లన్నీ నిర్మానుష్యం: జిల్లాలో ఎండల తీవ్రత గణనీయంగా పెరగడంతో మధ్యాహ్నానికంతా రోడ్లన్నీ జనాలు లేక కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. పగటపూట పనుల మీద తిరిగే జనాలు, పొలాల్లోకి పనులపైన వెళ్లే రైతులు ఎండల తీవ్రతతోపాటు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో గర్భిణులు, వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

పెరిగిన విద్యుత్తు వినియోగం: ఎండల తీవ్రత పెరగడంతో విద్యుత్తు వినియోగం కూడా భారీగా పెరిగింది. ఎండల తీవ్రతకు 24 గంటలు ఫ్యాన్లు తిరుగుతూనే ఉన్నాయి. వీటితోపాటు కూలర్లు, ఏసీల వాడకం కూడా పెరిగింది. బయట తిరిగే జనాలు ఎండ నుంచి తప్పించుకునేందుకు టోపీలను, చిన్నపాటి గొడుగులను కొనుగోలు చేస్తున్నారు.

ఎండలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు...



- బయటకు వెళ్లేటప్పుడు తప్పకుండా ఎండ తీవ్రతను తప్పించుకునేందుకు తప్పనిసరిగా గొడుగు లేదా టోపీ వాడాలి
- తెలుపురంగు, పలచటి వస్త్రాలతోపాటు లూజుగా ఉన్న దుస్తులనే వేసుకోవాలి
- ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య అవసరమైతే తప్ప ఆరుబయట తిరగకూడదు
- వీలైనన్ని సార్లు నీరు తాగుతుండాలి. అలాగే ఎండలో తిరిగే సమయంలో కొబ్బరినీరు, మజ్జిగ, పండ్ల రసాలు వంటి ఎక్కువగా తీసుకోవాలి. అలాగే నీటిలో నిమ్మరసం, కాస్తంత ఉప్పు కలిపిన ద్రావణాన్ని కూడా అప్పుడప్పుడు తీసుకుంటే మంచిది.
- దీంతోపాటు దూరప్రాంతాలకు ప్రయాణం చేసే వారు ఉదయం 10 గంటలలోపు గమ్యాలను చేరుకునేలా ప్లాన్ చేసుకోవాలి. అలాగే సాయంత్రం 4 గంటల తరువాత ప్రయాణం చేయాలి.
- ఎండలో బయటకు వెళ్లినప్పుడు తల తిరగడం, వికారం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణం వైద్యులను సంప్రదించి తగిన సూచనలు, సలహాలను పాటించడంతోపాటు జాగ్రత్తలు తీసుకోవాలి.

జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రత వివరాలు..

తేదీ	కనిష్ఠం	గరిష్ఠం
20.04.25	26.8	38.8
21.04.25	28.8	40.0
22.04.25	27.3	41.0
23.04.25	26.6	42.6
24.04.25	27.8	41.6
25.04.25	28.0	42.4
26.04.25	28.0	42.0



కూలర్ సేదలో మిఠాయి షాపు యజమాని



జనాలు లేక బోసి పోయిన హెడ్‌పోస్టాఫీస్ నుంచి పాతబస్టాండుకు వచ్చే రోడు

రోజుకు ఆరు లీటర్లు నీరు తాగాలి



వేగంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో చర్మంలోని నీటి శాతం పూర్తిగా ఆవిరైపోతుంది. ఎండ విపరీతంగా పెరగడంతో చెమట ద్వారా సోడియం లవణాలు ఎక్కువగా వెళ్లిపోతాయి. కొంత పొటాషియం లవణాలు కూడా వెళ్లిపోవడంతో హీట్ హైపర్ పైరెక్సియా అనే వడదెబ్బ సోకే ప్రమాదం ఉంది. దీంతో జ్వరం, మగతగా కమ్మటం, వాంతులు రావడం జరుగుతుంది. లవణాల శాతం ఉధృతంగా తగ్గితే కోమాలోకి వెళ్లే అవకాశం ఉంటుంది. బయటకు వెళ్లేవారు ఉప్పు బాగా వేసుకుని మజ్జిగ తీసుకోవాలి. అరటిపండు తప్పకుండా తీసుకోవాలి. బయట తిరిగే ప్రతి ఒక్కరూ రోజుకు నాలుగు నుంచి ఆరు లీటర్ల నీరు తాగుతూ ఉండాలి.

– డాక్టర్ కొటకొండ మనోహర్, జనరల్ ఫిజిషియన్, రిమ్స్

జాగ్రత్తలు పాటించాలి




జిల్లాలో ఎండల తీవ్రత క్రమేపి పెరుగుతూ వస్తుంది. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయం 10 గంటలలోపు పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలి. ఎండలకు ఎక్కువగా తిరిగే వాళ్లు తలపై టోపీ లేక కండువానో ధరించడంతోపాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. దీనికి తోడు మంచినీటిని క్రమం తప్పకుండా తీసుకోవాలి. వడదెబ్బకు గురైన వ్యక్తిని ముందుగా చల్లని ప్రదేశంలో ఉంచాలి. చల్లని తడి గుడ్డతో ఒళ్లంతా తుడవాలి. ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు చల్లని గాలి తగిలేలా చర్యలు తీసుకోవాలి. తరువాత ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాపించాలి. తరువాత వైద్యుడిని సంప్రదించి ఆయన సూచనలు, సలహాల మేరకు వైద్య సేవలందించాలి.

– నాగరాజు, డీఎంఅండ్‌హెచ్ఓ

10 నుంచి దేవుని కడపలో తెప్పోత్సవాలు

కడప కల్చరల్: తిరుమల తొలిగడప దేవుని కడప శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి మే 10 నుంచి 12వ తేదీ వరకు తెప్పోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి తెలిపారు. స్వామి, అమ్మవార్లు ఆలయ పుష్కరిణిలో ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు తెప్పపై విహరించి భక్తులను కటాక్షించనున్నట్లు ఆయన వివరించారు. ఇందులో భాగంగా మే 10న శ్రీ కృష్ణ సమేత గోదాదేవి మూడు మార్లు పుష్కరిణిలో విహరిస్తారన్నారు. 11న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారు ఐదు మార్లు, 12న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారు ఏడు మార్లు తెప్పలపై విహరించనున్నట్లు తెలిపారు. ఈ మూడు రోజులు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని వివరించారు.



తెప్పోత్సవంలో స్వామి, అమ్మవార్లు (ఫైల్)

బీసీ కుల గణనపై ప్రకటన చేయాలి

కడప రూరల్: కడపలో జరిగే మహానాడులో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీ కుల గణనపై స్పష్టమైన ప్రకటన చేయాలని.. అలాగే 52 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు డీఎం ఓబులేశు యాదవ్ అధ్యక్షతన శనివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ మహాసభ జాతీయ కన్వీనర్ అవ్వారు మల్లికార్జున, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఏ సత్తార్ మాట్లాడుతూ దేశ జనాభాలో 60 శాతం ఉన్న బీసీ కులాలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉండడం దారుణమన్నారు. బీసీలను కేవలం ఓటుబ్యాంకు రాజకీయాలకు వాడుకుంటున్నారని తెలిపారు. బీసీ ఓట్లను మాత్రం పొందుతూ సీట్ల కేటాయింపులో మాత్రం బీసీలకు దగా చేస్తున్నారని ధ్వజమెత్తారు. తక్షణమే కుల జన గణన చేపట్టాలని, బీసీ కులాలకు 52 శాతం రిజర్వేషన్లు, జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఓబులేశు యాదవ్ మాట్లాడుతూ కడపలో జరిగే మహానాడులో రాష్ట్ర ముఖ్యమంత్రి బీసీ కుల గణనపై స్పష్టమైన ప్రకటన చేయాలని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, లోక్‌సత్తా పార్టీ నాయకులు దేవర శ్రీకృష్ణ మాట్లాడారు. జాతీయ బీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు బీసీ రమణ, మహాజన రాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు సంగటి మనోహర్, దళితమిత్ర రాష్ట్ర అధ్యక్షులు కైపు రామాంజనేయులు, సీఆర్‌వీ ప్రసాద్, తిరుమలేశ్, పట్టుపోగుల పవన్‌కుమార్, సీఆర్ఐ సునీల్ పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘాల నేతలు

మనుంటి ముంగిటే సాంకేతిక విద్య!

- విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తున్న 'మను' పాలిటెక్నిక్
- నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఏపీలో ఏకైక పాలిటెక్నిక్ కళాశాల
- నాలుగు బ్రాంచుల్లో ఏటా 240 సీట్లు కేటాయింపు
- మే 13 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- కళాశాల ప్రవేశానికి జూన్ 13న ప్రవేశ పరీక్ష నిర్వహణ



కడప రిమ్స్ వద్ద ఏర్పాటు చేసిన మను పాలిటెక్నిక్ కళాశాల



మను కళాశాలలో ఫిజిక్స్ ల్యాబ్

కడప ఎడ్యుకేషన్: మౌలానా అజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మను) అనుబంధ సంస్థ 'మను' పాలిటెక్నిక్ కళాశాల జిల్లా విద్యార్థులకు వరంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం దీనిని కడప నగర శివార్లలోని రిమ్స్ వద్ద 10.15 ఎకరాల స్థలాన్ని కేటాయించి యూనివర్సిటీ గ్రాంట్ కమీషన్, మినిస్ట్రియల్ ఆఫ్ ఎడ్యుకేషన్ వారి ఆర్థిక సహాయంతో రూ. 25 కోట్లతో నూతన భవనాలతోపాటు ఇన్‌ఫ్రాస్టక్చర్స్, కంప్యూటర్ లాబ్స్, ఫిజిక్స్ ల్యాబ్, లైబ్రరీ వంటివి ఏర్పాటు చేశారు. అలాగే కళాశాల ఆవరణం మొత్తం ప్రహరీని ఏర్పాటు చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఆధ్వర్యంలో భారతదేశ వ్యాప్తంగా బీహార్‌లోని దర్భాంగ్, ఒరిస్సాలోని కటక్, కర్నాటకలోని బెంగులూరు, తెలంగాణలోని హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో మాత్రమే ఈ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి.

ఏయే కోర్సులు అందుబాటులో ఉన్నాయంటే.. మను పాలిటెక్నిక్ కళాశాలలో నాలుగు రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇందులో డిప్లమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్, డిప్లమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్, డిప్లమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్, డిప్లమా ఇన్ అప్పరల్ టెక్నాలజీ కోర్సులు ఉన్నాయి. ఇందులో ప్రతి కోర్సుకు 60 సీట్ల చొప్పున 240 సీట్లు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్, సెంట్రల్ లైబ్రరీలతోపాటు అన్ని కోర్సులకు సంబంధించి వర్కుషాపులు ఉన్నాయి.

మే 13 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు.... మను పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి మే 13 తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రవేశ పరీక్ష జూన్ 13వ తేదీ కడప సమీపంలోని రిమ్స్ వద్ద ఉన్న మను పాలిటెక్నిక్ కళాశాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఉంటుంది. ఇందులో ప్రవేశ పరీక్షకు బాలికలు రూ.350, బాలురు రూ.550 రుసుం చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థులకు వచ్చిన ర్యాంకుల బట్టి రోస్టర్ కమ్ మెరిట్ ప్రకారం సీట్లు భర్తీ చేస్తారు.

ప్రవేశానికి అర్హులెవరంటే...

ఈ మను పాలిటెక్నిక్ కళాశాలలో అన్ని కేటగిరీలకు చెందిన విద్యార్థులు చేరవచ్చు. ఇందులో ప్రత్యేకత ఏంటంటే ఏ కేటగిరికి చెందిన వారైనా సరే పదవ తరగతిలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో చదువుతున్నా సరే లాంగ్వేజికి సంబంధించి ఉర్దూ సబ్జెక్టు లేదా ఉర్దూ మీడియంలో చదివే వారే ఇందులో సీటుకు అర్హులు. ఇందులో చేరాలనుకునే వారు ఖచ్చితంగా ప్రవేశ పరీక్షను రాసి ర్యాంకును సాధించాలి. అలా ర్యాంకులు సాధించిన వారికి కేటగిరీల(ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఫిజికల్ హ్యాండీక్యాప్, ఉమెన్ కోటా) వారిగా రోస్టర్ కమ్ మెరిట్ ప్రకారం సీట్లను కేటాయిస్తారు. ఇందులో చేరే వారిలో ఆడపిల్లలకైతే మూడేళ్లకు రూ.13,100లు, మగపిల్లలు మూడేళ్లకు రూ.14,700 లు, వికలాంగ విద్యార్థులు మూడేళ్లకు రూ. 5100 రూపాయిల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఇందులో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు నేషనల్ స్కాలర్‌షిప్స్ వంటికి కూడా పొందవచ్చు.



మను పాలిటెక్నిక్ కళాశాల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న కళాశాల అధ్యాపకులు

వెబ్‌సైట్ ద్వారా...



మను పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించిన అడ్మిషన్ సమాచారం కోసం htpp:// manucoe.in /regular adimission వెబ్‌సైట్‌ను సంప్రదించాలి. ఈ వెబ్‌సైట్ ద్వారా మరింత సమగ్ర సమాచారం తెలుసుకోవచ్చు. దీంతోపాటు అడ్మిషన్ల పరంగా ఏదైనా సందేహాలు, సమాచారం కోసం 9398083058 నెంబర్‌కు కాల్ చేసి సంప్రదించవచ్చు.

– మొహమ్మద్ సికిందర్ హుస్సేన్, అడ్మిషన్ కన్వీనర్, మను పాలిటెక్నిక్ కళాశాల

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఏపీలో భాగంగా కడపలో ఏర్పాటు చేసిన మను పాలిటెక్నిక్ కళాశాలను జిల్లా విద్యార్థులు వినియోగించుకోవాలి. ఈ కళాశాలలో డిప్లమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్, డిప్లమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్, డిప్లమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్, డిప్లమా ఇన్ అప్పరెల్ టెక్నాలజీ కోర్సులు ఉన్నాయి. ఈ నాలుగు కోర్సులకు సంబంధించి 240 సీట్లు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– మీర్జా విలయత్ అలీ బేగ్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, మను పాలిటెక్నిక్ కళాశాల, వైఎస్సార్‌జిల్లా

ట్రేడింగ్ పేరుతో కోట్లు వసూలు

- నిండా మునిగిన బాధితులు
- ఆత్మహత్యలే శరణ్యమంటూ ఆవేదన

కడప రూరల్: ఫారెక్స్, స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్ పేరుతో కడపలో పామిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి పలువురిని నమ్మించి రూ.కోట్లలో మోసం చేసి పరారైన ఘటన వెలుగు చూసింది. మీడియాకు శనివారం బాధితులు ఈ వివరాలు తెలియజేస్తూ, తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని పేర్కొన్నారు. బాధితుల ఆవేదన వారి మాటల్లోనే...



మోసపోయిన బాధితులు

నిండా మునిగాం..



ప్రామిసరి నోటును చూపుతున్న రాజేశ్వరరెడ్డి

పట్టణంలోని లోహియానగర్‌కు చెందిన పామిరెడ్డి సోమశేఖర్ రెడ్డి ట్రేడింగ్ ద్వారా అధిక లాభాలు వస్తాయని పలువురిని నమ్మబలికాడు. రూ. 10 లక్షలకుగాను నెలకు రూ.40 వేలు లాభం వస్తుందని చెప్పాడు. అతని మాటలు నమ్మి నాతోపాటు నా కుటుంబ సభ్యులు మొత్తం రూ. 8.50 కోట్లు ఇచ్చారు. అలాగే నాతోపాటు ఇక్కడికి వచ్చిన బాధితులు సాయి రూ. 70 లక్షలు, వెంకట కృష్ణ రూ. 50 లక్షలు, మల్లికార్జునరెడ్డి రూ. 50 లక్షలు, కిరణ్‌కుమార్‌రెడ్డి రూ. 50 లక్షలు, రాజేశ్వర్‌రెడ్డి రూ. 60 లక్షలు, విష్ణువర్ధన్ రెడ్డి రూ. 50 లక్షలు ఇచ్చారు. ఇలా ఇచ్చిన డబ్బుపై కొన్నింటికి ప్రామిసరీ నోట్లు, మరికొన్నింటికి చెక్కులు ఉన్నాయి. వసూలు చేసిన డబ్బు కొంత సోమశేఖర్‌రెడ్డి తన ప్రేయసి ఖాతాలో కూడా జమ చేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై అనుమానం వచ్చి ప్రశ్నిస్తే, సోమశేఖర్‌రెడ్డి బెదిరింపులకు దిగి చివరకు పరారయ్యాడు. ఈ దారుణంపై కడప రిమ్స్ పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టాం. పోలీసులు సోమశేఖర్‌రెడ్డి సోదరులను ప్రశ్నించారు తప్ప, అంతకుమించి ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.

– టేకూరు రాజేశ్వర్‌రెడ్డి, కడప

ఇల్లు తాకట్టుపెట్టి...అప్పు తెచ్చి...



ఇంటిని తాకట్టుపెట్టి రూ. 50 లక్షలు, అప్పు తెచ్చి మరో రూ. 50 లక్షలు ఇచ్చాను. రూ. 50 లక్షలకు ప్రామిసరి నోటు రాసిచ్చాడు. మరో రూ. 50 లక్షలకు చెక్కు ఇచ్చాడు. నా పరిస్థితి దయనీయంగా మారింది.

– కల్లూరి కిరణ్‌కుమార్‌రెడ్డి, పోరుమామిళ్ల



రూ. 70 లక్షలు ఇచ్చాను



ఇల్లు కుదువకు పెట్టి లోను తీసుకుని రూ. 70 లక్షలు ఇచ్చాను. ఒక్క పైసా కూడా తిరిగి ఇవ్వలేదు. నా పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. నాలాంటి వారు ఎందరో ఇబ్బందులు పడుతున్నారు.

– సాయికుమార్, కడప

క్లుప్తంగా

బ్రహ్మంసాగర్‌లో కృష్ణా జిల్లా వాసి ఆత్మహత్య


మృతి చెందిన వీరబ్రహ్మాచారి

బ్రహ్మంగారిమఠం : కృష్ణా జిల్లా మైలవరానికి చెందిన వీరబ్రహ్మాచారి(45) శనివారం బ్రహ్మంసాగర్‌లో శవమై తేలాడు. పోలీసుల వివరాల మేరకు.. వీరబ్రహ్మాచారి రెండు రోజుల క్రితం బ్రహ్మంసాగర్‌లో మునిగి శనివారం శవమై తేలాడు. అతని వద్ద ఉన్న ఆధార్ కార్డును పరిశీలించగా కృష్ణా జిల్లా మైలవరానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో అడవి దుప్పి మృతి


వాహనం ఢీకొని మృతి చెందిన దుప్పి


చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని కడప–చిత్తూరు జాతీయ రహదారిపై జమాల్‌పల్లె సమీపంలోని షెపర్డ్ స్కూల్ వద్ద శనివారం తెల్లవారుజామున పాడదుప్పి మృతి చెందింది. రోడ్డు దాటుతున్నపుడు గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది. సమాచారం తెలుసుకున్న కడప అటవీ శాఖ రేంజర్ ప్రసాద్ తమ సిబ్బందిని పంపి పోస్టుమార్టం చేయించి ఖననం చేయించారు.

పాఠశాలలు తెరిచే నాటికి పాఠ్య పుస్తకాలు

కడప ఎడ్యుకేషన్ : పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులందరికి పాఠ్యపుస్తకాలను అందజేస్తామని డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. కడప పాఠ్యపుస్తకాల గోడౌన్ నుంచి శనివారం పాఠ్య పుస్తకాల వాహనాన్ని గోడౌన్ మేనేజర్ రామాంజనమ్మతో కలిసి డీఈఓ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పుస్తక గోడౌన్ నుంచి ఉమ్మడి జిల్లాకు సెమ్–1కు సంబంధించి 9,76,346 పుస్తకాలు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 7,20, 161 పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు.

ట్రిపుల్ ఐటీలతో.. ఉజ్వల భవిష్యత్తు

- ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- పదవ తరగతి మార్కుల ఆధారంగా విద్యార్థుల ఎంపిక
- 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ట్రిపుల్ ఐటీల ఏర్పాటు
- ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు నాలుగు శాతం డిప్రివేషన్ స్కోరును జోడించి అభ్యర్థుల ఎంపిక


ఇడుపులపాయలోని ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ ముఖ ద్వారం

వేంపల్లె : రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ(ఆర్జీయూకేటీ)లో 2025–26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఒక్కో ట్రిపుల్ ఐటీకి 1000 సీట్ల చొప్పున 4వేల సీట్లను ఆర్జీయూకేటీ అధికారులు కేటాయించారు. అలాగే ఈబీసీ కోటా కింద ఒక్కో ట్రిపుల్ ఐటీకి 100 సీట్ల చొప్పున 400 సీట్లను కేటాయించారు. 2024–25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల చూపంతా ట్రిపుల్ ఐటీ వైపు మళ్లింది. ఈ నెల 24వ తేదీన నోటిఫికేషన్ విడుదల కాగా.. ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారు. మే 20వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. ఎంపికైన అభ్యర్థుల జాబితా జూన్ 6న విడుదల చేస్తారు. జూన్ 11 నుంచి 17 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తారు. స్పెషల్ కేటగిరి (పీహెచ్‌సీ/ క్యాప్/ఎన్‌సీసీ/స్పోర్ట్స్/భారత్ స్కౌట్స్) కోటా అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను మే 28 నుంచి 31వ తేదీ వరకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో నిర్వహిస్తారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన అనంతరం జూలై మొదటి వారంలో తరగతులు ప్రారంభించే అవకాశం ఉంది.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యున్నత సాంకేతిక విద్యను అందించేందుకు 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఇడుపులపాయ, నూజివీడు, తెలంగాణా రాష్ట్రంలోని బాసరలో ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో ఒక్కోదానికి 2000 సీట్లను కేటాయించగా.. తర్వాత ప్రభుత్వాలు 2010లో ఒక ట్రిపుల్ ఐటీలో 1000 సీట్లు ఉండేలా కుదించారు. 2014 రాష్ట్ర విభజన అనంతరం బాసర ట్రిపుల్ ఐటీ తెలంగాణకు వెళ్లిపోవడంతో 2016లో ఏపీలో ఒంగోలు, శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీలను ప్రారంభించారు. వీటిలో 26 జిల్లాల విద్యార్థులకు సమానంగా సీట్లు ఇవ్వాలని యూనివర్సిటీ అధికారులు నిర్ణయించారు. 4000 సీట్లలో ఓపెన్ కేటగిరిలో 600 సీట్లను స్థానికేతరులు, తెలంగాణ ఎన్ఆర్ఐ, తదితరులకు కేటాయిస్తారు. మిగిలిన 3400 సీట్లను 26 జిల్లాల వారికి సమానంగా పంచుతారు. జిల్లాకు కేటాయించే సీట్ల ఆధారంగా మెరిట్ విద్యార్థులకు అవకాశం లభించనుంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివిన విద్యార్థులకే ట్రిపుల్ ఐటీల్లో అధిక సీట్లు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన వారికే ఈ అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ఎంపిక ప్రక్రియ ఇలా

ఎంపిక ప్రక్రియలో భాగంగా ఇద్దరు విద్యార్థులకు సమాన మార్కులు వస్తే తొలుత గణితం అనంతరం జనరల్ సైన్స్ తర్వాత ఇంగ్లీషు, సోషల్ స్టడీస్, ఫస్ట్ లాంగ్వేజ్‌లో అధిక మార్కులు వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తారు. అప్పటికి సమానంగా వస్తే పుట్టిన తేదీ ప్రకారం అధిక వయస్సు ఉన్న వారిని హాల్ టికెట్ నెంబర్ నుంచి పొందిన అత్యల్ప సంఖ్య ఆధారంగా ఎంపిక చేస్తారు.

నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు..

ట్రిపుల్ ఐటీలలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు గిగిగి. ఖ్ఖటఖ్ఖీ. ఖ్టా. అ్క వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. బీసీ, ఈడబ్ల్యూఎస్, ఓసీ విద్యార్థులకు దరఖాస్తు రుసుము రూ.300లు కాగా, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200లుగా నిర్ణయించారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్

ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్లకు రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటిస్తారు. రాష్ట్రంలోని అభ్యర్థులకు 85 శాతం సీట్లు, మిగిలిన 15 శాతం సీట్లు రాష్ట్ర పునర్విభజన చట్టం 2014 ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులకు కేటాయిస్తారు. అడ్మిషన్లలో కచ్చితంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తారు. ఎస్సీ–15 శాతం, అనగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్–2 ప్రకారం ఎస్సీ గ్రూపు–1 కి 1 శాతం, గ్రూప్– 2 కి 6.5 శాతం, గ్రూప్ –3 కి 7.5 శాతం ప్రకారం సీట్లను భర్తీ చేస్తారు. మిగిలిన కేటగిరీలో ఎస్టీ–6, బీసీ(ఏ)–7, బీసీ(బి)–10, బీసీ (సి)1, బీసీ (డి)7, బీసీ(ఈ) 4, దివ్యాంగులకు–5 శాతం ప్రకారం సీట్లను భర్తీ చేస్తారు. ఆర్మీ ఉద్యోగుల పిల్లలు (సీఏపీ)–2, ఎన్‌సీసీ–1, స్పోర్ట్స్–0.5, భారత్ స్కౌట్స్ ఆఫ్ గైడ్స్–0.5 శాతం సీట్లు కేటాయిస్తారు. ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కేటగిరిలో బాలికలకు 33.1/3 శాతం సీట్లు కేటాయిస్తారు.

మొత్తం 4400 సీట్లు

రాష్ట్రంలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో ఒక్కో క్యాంపస్‌కు 1000 సీట్ల చొప్పున మొత్తం 4వేల సీట్లు ఉన్నాయి. అదేవిధంగా ఈబీసీ కోటా కింద ఒక్కో క్యాంపస్‌కు 100 సీట్ల చొప్పున 400 సీట్లు ఉన్నాయి. వీటికి సంబంధించిన నోటిఫికేషన్ రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 2024–25 విద్యా సంవత్సరంలో జరిగిన 10వ తరగతి పరీక్షల్లో 6,14,459 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, అందులో 4,98,585 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 2,45,307 మంది, బాలికలు 2,53,278 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన వారి సంఖ్య అధికంగా ఉండడంతో గట్టి పోటీనే ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

అన్ని జిల్లాలకు సమానంగా సీట్లు



ఆర్జీయూకేటీ పరిధిలోని అన్ని ట్రిపుల్ ఐటీల్లో ఆయా జిల్లాల్లో సమానంగా సీట్లు కేటాయిస్తాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 4శాతం, డిప్రివేషన్ స్కోరును జోడించి మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తాం. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ సండ్ర(ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కన్వీనర్), ఇడుపులపాయ

ధ్వజారోహణంతో పుష్పగిరి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


వైద్యనాథేశ్వర స్వామి ఆలయంలో ధ్వజారోహణం

వల్లూరు : పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలోని శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి ,శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వాముల బ్రహ్మోత్సవాలు శనివారం రెండు ఆలయాల్లో నిర్వహించిన ధ్వజారోహణం కార్యక్రమంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. వైద్యనాథేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ నిర్వహించారు. నందీశ్వరుని చిత్ర పటాన్ని ధ్వజ స్తంభంపై అధిష్టింప జేశారు. రాత్రి హంస వాహనంపై శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. పూజల అనంతరం దివిటీల వెలుగులు, మంగళ వాయిద్యాల మధ్య మాడ వీధుల్లో స్వామి వారి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

■ కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో తెల్లవారు జామున సుప్రభాత సేవ జరిగింది. అనంతరం ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో విశ్వక్సేన పూజ నిర్వహించారు. అనంతరం రాత్రి ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలతో ప్రారంభించి గరుడుని చిత్ర పటాన్ని ధ్వజ స్తంభంపై అధిష్టింప చేశారు. అనంతరం కొండపై నుండి స్వామి వారిని తిరుచ్చి వాహనంలో మోస్తూ గ్రామ మాడ వీధుల్లో గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ కౌన్సిలర్ మృతి

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మైదుకూరు – బద్వేలు జాతీయ రహదారిలోని జెడ్.కొత్తపల్లె సమీపంలో శుక్రవారం రాత్రి లారీ, కారు ఢీ కొన్న సంఘటనలో మైదుకూరుకు చెందిన మున్సిపల్ కౌన్సిలర్ షేక్ ఖాదర్‌బాషా(44) మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బి.మఠం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మైదుకూరు పట్టణం బద్వేలు రోడ్డులో నివాసం ఉంటున్న టీడీపీకి చెందిన మున్సిపల్ 5వ వార్డు కౌన్సిలర్ షేక్ ఖాదర్‌బాషా(44)కు చెందిన టిప్పర్ పీపీ కుంట వద్ద చెడిపోయి ఉండడంతో ఆయన శుక్రవారం రాత్రి తన సహాయకులు మహబూబ్ బాషా, మస్తాన్‌లను తీసుకుని కారులో బయలుదేరాడు. ముందు వెళుతున్న వాహనాన్ని క్రాస్ చేస్తుండగా ఎదుగా వస్తున్న లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఖాదర్ బాషా అక్కడికక్కడే మృతి చెందగా, మహబూబ్‌బాషా, మస్తాన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. మహబూబ్ బాషా పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తరలించారు. మృతుడు ఖాదర్‌బాషాకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.


ఖాదర్‌బాషా (ఫైల్)


లారీ–కారు ఢీ కొన్న దృశ్యం

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


పొలంలో విగతజీవుడై పడి ఉన్న రైతు

లింగాల : లింగాల మండలం వెలిదండ్ల గ్రామంలో విద్యుత్ షాక్‌తో నల్లపురెడ్డిగారి మేఘనాథరెడ్డి (42) అనే రైతు మృతి చెందాడు. వివరాలలోకి వెళితే.. మేఘనాథరెడ్డి స్వగ్రామం సింహాద్రిపురం మండలం బిదినంచర్ల గ్రామం. ఆయన చీనీ కాయల వ్యాపారం చేస్తూ వ్యవసాయ పనులు చేసుకునేవాడు. ప్రస్తుతం ఆయన పులివెందులలో నివాసముంటున్నాడు. వెలిదండ్ల గ్రామంలోని కర్ణా నాగార్జునరెడ్డి కుమార్తెను వివాహం చేసుకున్నాడు. కర్ణా నాగార్జునరెడ్డికి ఒకే కుమార్తె కావడంతో ఆయన పొలాలను కూడా మేఘనాథరెడ్డి చూసుకునేవాడు. శనివారం మధ్యాహ్నం చీనీ తోటలోని పొలంలోకి వెళ్లి మోటార్ ఆన్ చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంతోసేపటికి ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య కంగారుపడి బిదినంచర్ల, వెలిదండ్ల గ్రామాల బంధువులకు ఫోన్లు చేసి వివరాలను అడిగింది. వారు అనుమానంతో పొలంలోకి వెళ్లి చూడగా, మేఘనాథరెడ్డి విగతజీవుడై పడి ఉన్నాడు. బంధువుల ఫిర్యాదు మేరకు లింగాల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పలువురు దొంగల అరెస్టు

- రూ.23 లక్షలు విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ మురళీ నాయక్


దొంగల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీ నాయక్, సీఐలు, తదితరులు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలో 2024 జనవరి నెల నుంచి సెప్టెంబర్ నెల వరకు వరుస దొంగతనాలకు పాల్పడిన వారిని అరెస్టు చేసినట్లు పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ తెలిపారు. శనివారం స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. పులివెందుల, బద్వేలు, కలమల్ల తదితర ప్రాంతాలలో వరుస దొంగతనాలు చేసిన నవీన్, గణేష్, గంగాధర్, రాజశేఖర్, చంద్ర, మహేష్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 300 గ్రాముల వెండి, టీవీతోపాటు ద్విచక్ర వాహనాలు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జల్సాలకు, షికార్లకు అలవాటుపడిన ఆరుగురు యువకులు ఇళ్లలో ఎవరూ లేని సమయాల్లో ఇళ్లలోకి చొరబడి దొంగతనాలు చేసేవారన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీసు బృందం సీఐలు చాంద్ బాషా, వెంకటరమణల ఆధ్వర్యంలో నిఘావేసి బంగారు దొంగలను అరెస్టు చేశారన్నారు. ప్రత్యేక బృందానికి సహకరించిన కానిస్టేబుళ్లు వేణుగోపాల్ రావు, రమేష్, పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు.

ఉగ్రవాదం, మతోన్మాదాలను అరికట్టాలి

- జమ్ము కశ్మీర్ సంఘటనపై ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ


ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీ

కడప సెవెన్‌రోడ్స్ : జమ్ము కశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రవాద మారణ హోమానికి నిరసనగా ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం స్థానిక స్టేట్ గెస్ట్ హౌస్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పెద్ద ఎత్తున దేశ సమైక్యతను కాపాడుతామని, ముస్లిం, హిందూ, క్రైస్తవులు భాయి భాయి అని, ఉగ్రవాదాన్ని అరికట్టాలని, దేశ సమైక్యతను కాపాడాలని, ఉగ్రవాదులను అణిచివేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం ప్రజా ఐక్యవేదిక నాయకుడు డాక్టర్ రాజా వెంగల్ రెడ్డి మాట్లాడుతూ ర్యాలీలో కులాలు మతాలకు అతీతంగా పాల్గొనడం ప్రజల్లో మతసామరస్యానికి ప్రతిరూపమన్నారు. ఐక్యవేదిక నాయకులు డాక్టర్ ఓబుల్ రెడ్డి, గుజ్జుల ఈశ్వరయ్య, చంద్రశేఖర్, రవిశంకర్ రెడ్డి, బాబు భాయ్, జోగిరామిరెడ్డి, ముక్తియార్ అహ్మద్, రమణ మాట్లాడుతూ కొంతమంది స్వార్థపరులు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ భారత దేశాన్ని

ముక్కలుగా చేయటానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఉగ్రవాదానికి కులం మతం ప్రాంతం ఉండదని, మతోన్మాదానికి కూడా అలాగే కులం మతం ప్రాంతం ఉండదని వారు తెలిపారు. ఈ ఉగ్రవాద దాడికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు చంద్రశేఖర్, లక్ష్మీరాజా, నాగ మునిరెడ్డి, శంకర్, రవికుమార్, నాజర్, రామ్మోహన్, అలీఖాన్, శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ అశోక్ కుమార్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను బహిరంగంగా ఉరి తీయాలి

రాజంపేట టౌన్ : పహల్గాంలో అభంశుభం తెలియని 28 మందిని పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను బహిరంగంగా ఉరి తీయలాని పట్టణంలోని ముస్లీం మైనార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల ఉన్మాదాన్ని నిరసిస్తూ, ఉగ్రవాదుల చేతిలో అసువులు బాసిన వారి ఆత్మశాంతి కోసం శనివారం రాత్రి ముస్లీం మైనార్టీ నాయకులు ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముస్లీం మైనార్టీ నాయకులు మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకలించేందుకు కేంద్రం గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతి భారతీయుడు అండగా నిలుస్తాడని తెలిపారు.

గేదె అడ్డు రావడంతో.. బైకు అదుపు తప్పి

రోడ్డు ప్రమాదంలో పాలిటెక్నిక్ విద్యార్థి దుర్మరణం


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సుభాష్ చంద్రబోస్

చాపాడు : కాలేజీకి బైక్‌లో వెళుతుండగా ఎదురుగా గేదె అడ్డు రావడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక విద్యార్థి మృతి చెందగా మరో విద్యార్థికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. దువ్వూరు మండలంలోని కృష్ణంపల్లెకు చెందిన కామనూరు సుభాష్ చంద్ర బోస్(17) అనే విద్యార్థి చాపాడు సమీపంలోని సీబీఐటీలో పాలిటెక్నిక్ డిప్లమో సీఎంబీ ఫస్టియర్ చదువుతున్నాడు. ఇతనితో పాటు చియ్యపాడుకు చెందిన కోగటం శృతికుమార్ కూడా చదువుకుంటున్నాడు. ఈ క్రమంలో సుభాష్‌చంద్రబోస్ తన అక్క, బావలు ఉంటున్న చియ్యపాడుకు శుక్రవార సాయంత్రం వచ్చాడు. శనివారం ఉదయం 8గంటల ప్రాంతంలో ఇదే గ్రామంలో ఉన్న తన స్నేహితుడిని బైక్‌పై ఎక్కించుకుని చాపాడు మండలం పల్లవోలు వద్ద గల సీబీఐటీ కాలేజీకి బయలు దేరాడు. చాపాడు దాటుకుని రెండు నిమిషాల్లో కాలేజీకి చేరుకునే లోపే రోడ్డుపై గేదె అడ్డు వచ్చింది. దీంతో బైక్ గేదెన తగిలి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైన సుభాష్ చంద్రబోస్ అక్కడికక్కడే మృతి చెందగా శృతికుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చేతికందే కొడుకు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో సుభాష్ కుటుంబీకులు రోదించారు. మైదుకూరు–ప్రొద్దుటూరు జాతీయ రహదారిలో వెళ్లే వాహనదారులు అయ్యో పాపం అంటూ విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఆర్మీ ఉద్యోగి మృతి


మృతి చెందిన విజయ భాస్కర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని నారాయణ పాఠశాలకు వెళ్లే రహదారి సమీపంలో దేవిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి (55) శనివారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు విజయ భాస్కర్ రెడ్డికి భార్య పద్మావతి, కుమారుడు కార్తీక్ రెడ్డి, కుమార్తె దీపిక రెడ్డి ఉన్నారు. ఇటీవల విజయ భాస్కర్ రెడ్డికి, పద్మావతికి కుటుంబ సమస్యల వల్ల ఇద్దరు వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. పద్మావతి కుమారుడు కార్తీక్ రెడ్డితో కలిసి ముద్దనూరు రోడ్డులో ఉంటున్నారు. విజయభాస్కర్ రెడ్డికి బీపీ, షుగర్ ఎక్కువగా ఉండటంవల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తాయని, దీనికి తోడు కుటుబ సమస్యలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో విజయభాస్కర్ రెడ్డి మంచంపై మృతి చెంది పడి ఉన్నాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నారాయణ సంఘటన స్థలానికి చేరుకుని మృతికి గల కారణాలను చుట్టుపక్కల వారిని అడిగి తెలుసుకున్నారు. అతను ఆరోగ్యం సరిగా లేక మృతి చెందాడా లేక ఎవరైనా హత్య చేశారా అనే కోణంలో విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ ఏపీయూడబ్ల్యూజే కొవ్వొత్తుల ప్రదర్శన


జాతీయ జెండాలు చేతబూని కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

కడప కార్పొరేషన్ : జమ్మూ, కాశ్మీర్‌లో ఉగ్రవాదుల మారణకాండను నిరసిస్తూ ఏపీయూడబ్ల్యూజే, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా, వీడియోగ్రాఫర్, ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జర్నలిస్టులు శనివారం సాయంత్రం కోటిరెడ్డి సర్కిల్ నుంచి ఎర్రముక్కపల్లె సర్కిల్ వరకూ జాతీయ జెండాలు చేతబూని ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎర్రముక్కపల్లె సర్కిల్‌లో కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పి. రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు అంత్యంత పాశవికంగా కాల్పులు జరిపి 26 మంది అమాయకులను పొట్టన బెట్టుకోవడం దుర్మార్గమన్నారు. ఈ చర్యకు పాల్పడిన ఉగ్రవాదులను బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. పాకిస్తాన్ ఎన్ని కుట్రలు చేసినా భారతదేశాన్ని విచ్ఛిన్నం చేయలేదని హెచ్చరించారు. ఉగ్రదాడిలో మరణించిన వారికి ప్రగాఢ సంతాపం, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం. బాలక్రిష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు వెన్ను శ్రీనివాసరావు, ఆంజనేయులు, రమణారెడ్డి, ఫోటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, వర్కింగ్ జర్నలిస్టులు, కెమెరామెన్లు పాల్గొన్నారు.